# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-01-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **స్టార్టప్‌లు భారీగా పెరుగుతుండటంతో దేశంలోని యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

2. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుదు ఈ రోజు కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు.**

3. **ఉమ్మడి ఆదిలాబాద్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లో భారీగా పెట్టుబడి పెట్టేందుకు ఏఎం గ్రీన్ సంస్థ ముందుకొచ్చిందని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.**

==========================

స్టార్టప్‌లు భారీగా పెరుగుతుండటంతో దేశంలోని యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. స్టార్టప్ ఇండియా 10వ వార్షికోత్సవ సందర్భంగా ఢిల్లీలోని భారత మండపంలో నిన్న నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ.. దశాబ్ద కాలంలో స్టార్టప్ ఇండియా దేశంలో ఒక విప్లవాన్ని సృష్టించిందన్నారు. గత ఏడాది అత్యధికంగా 44 వేల కొత్త స్టార్టప్‌లు నమోదయ్యాయని చెప్పారు. దేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ కలిగిన దేశంగా నిలిచిందని ప్రధాన మంత్రి పేర్కొంటూ..

వాయిస్..27 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుదు ఈ రోజు కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా కాకినాడ సమీపంలోని ఎఎం గ్రీన్ అమోనియా ప్రైవేటు లిమిటెడ్ ప్లాంటు నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తో కలిసి ఆయన శంఖుస్థాపన చేయనున్నారు. ఈ ఉదయం ముఖ్యమంత్రి అమరావతి నుంచి కాకినాడ వెళతారని, అక్కడ 11 గంటల 20 నిముషాలకు ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేస్తారని అధికారులు వెల్లడించారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించనున్నట్లు తెలిపారు.

--------------------------

ఉమ్మడి ఆదిలాబాద్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

తెలిపారు. భోరాజ్ మండలం హతిఘాట్ గ్రామంలో చనాకా–కొరాటా పంప్‌హౌస్‌ను, మామడ మండలం పొన్కల్ గ్రామంలో సదర్మట్ బ్యారేజీని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులతో కలిసి ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. జిల్లా పర్యటనలో భాగంగా 386 కోట్ల 46 లక్షల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన భహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో భారీ పెట్టుబడి పెట్టేందుకు ఏఎం గ్రీన్ సంస్థ ముందుకొచ్చిందని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు సామాజిక మధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కాకినాడలో ఏఎం గ్రీన్ కంపెనీ.. 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏడాదికి 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయడంతోపాటు జర్మనీ, సింగపూర్, జపాన్‌కు ఎగుమతి చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్లాంట్ ఏర్పాటుతో 8 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. నంద్యాల జిల్లా కేంద్రంలో నిన్న నిర్వహించిన "ప్రజా దర్బారులో ప్రజల నుంచి వినతులను మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీదారులకు సత్వర న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రజల చెంతకే పాలనను తీసుకురావాలన్నది ప్రభుత్వ సంకల్పం అని పేర్కొన్నారు. అందుకు మన మిత్ర పేరుతో వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రవేశపెటామటని అన్నారు.

---------------------------

అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాదులోని శిల్పకళా వేదికలో నిన్న నిర్వహించిన కార్యక్రమంలో వివిధ శాఖల్లో గ్రూప్–3 ఉద్యోగాలకు ఎంపికైన వెయ్యి 370 మందికి నియామక పత్రాలను ముఖ్యమంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో అన్ని శాఖల్లో ఉద్యోగ నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రవేటు రంగంలోను లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు ఆకర్షించి ప్రపంచంతో పోటీ పడే విధంగా యువతను తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు.

---------------------------

భూమి, నీరు, గాలిని పరిరక్షించుకుని వ్యవసాయాన్ని సుస్థిరం చేసుకోవడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కాట్రపాడు గ్రామానికి చెందిన రైతు రమేష్ ఆకాశవాణితో మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడం సాధ్యమవుతుందని తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయాన్ని పొందడంతో పాటు, భూమిని కాపాడుకోవచ్చని పేర్కొంటూ..

..వాయిస్...25 సెకన్లు

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ వరకు పంపవచ్చు.

-----------------------------

రాష్ట్ర పర్యాటక రంగంలో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ ఒక నూతన అధ్యాయమని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలకు తెలంగాణ వేదిక అని చాటిచెప్పడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. హైదరాబాదులోని గోల్ఫ్ క్లబ్ లో ఈ ఫెస్టివల్ ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన హాట్ ఎయిర్ బెలూన్‌లో విహరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ ఫెస్టివల్స్ ద్వారా ఆధునిక సాంకేతికతను, భవిష్యత్తు దృక్పథాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని తెలిపారు. కేవలం దేశీయ పర్యాటకులనే కాకుండా విదేశీ పర్యాటకులను కూడా ఆకర్షించడానికి ఇటువంటి సాహసోపేత క్రీడలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమల్లో పొడి వాతావరణం నెలకొనడంతోపాటు, దట్టమైన పొగ మంచు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశము ఉందని వాతావరణ కేంద్ర అధికారి బి.శేఖర్ పేర్కొన్నారు. కనిష్ట ఉష్ణోగ్రతల్లో వచ్చే 5 రోజుల పాటు గణనీయమైన మార్పులు ఉండవని తెలిపారు.

మరోవైపు తెలంగాణలో రానున్న ఐదు రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రెండు రోజుల పాటు అదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల సెల్సియస్ లోపు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

-----------------------------

ఐసిసి పురుషుల అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా భారత్ జట్టు ఈరోజు బంగ్లాదేశ్ జట్టుతో తలపడనుంది. జింబాబ్వేలోని బులవాయోలో ఉన్న క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభం అవుతుంది.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి ప్రభల ఉత్సవాలు నిన్న వైభవంగా జరిగాయి. ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన జగ్గన్నతోట ప్రభల ఉత్సవంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రభలను కొలువుదీర్చుతారు. జిల్లాలోని అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం గ్రామీణ మండలాలకు చెందిన 11 ప్రభలను మధ్యాహ్నం రెండు గంట సమయానికి జగ్గన్నతోటకు తీసుకువచ్చారు. ఈ వేడుకను చూడడానికి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు. జగ్గన్నతోటకు ప్రభలను తీసుకువచ్చిన సాయంత్రం ఆయా గ్రామాలకు తిరిగి తీసుకువెళ్లారు.

=====================